GIRIJANA VIKAS NGO - Empowering Tribal and Rural Communities Since 2001

# గిరిజన వికాస్

వార్తా లేఖ

గిరిజనుల సాధికారత, పర్యావరణ హిత అభివృద్ధి
లక్ష్యంగా కలిసి సాగుదాం, కలిసి సాధిద్దాం!



January, 2026 www.girijanavikas.com For Private Circulation Only

# ప్రగతి పథంలో గిరిజన వికాసం: నవవసంతం.. నవ సంకల్పం




కాలచక్రం మరో పరిభ్రమణం పూర్తి చేసుకుని 2026 నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ, అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యం కొండల్లో సరికొత్త ఆశలు చిగురిస్తున్నాయి. రెండు దశాబ్దాల క్రితం, 2001లో జి.కె. వీధి కేంద్రంగా అంకురించిన మన 'గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ' నేడు వేల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతూ ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ఆదిమ గిరిజన తెగలు, షెడ్యూల్డ్ కులాలు మరియు వెనుకబడిన వర్గాల సాధికారత కోసం నిరంతరం శ్రమిస్తున్న మన సంస్థ, ఈ నవవసంతానికి సాదర స్వాగతం పలుకుతూ గడిచిన కాలంలోని విజయాలను సగర్వంగా నెమరువేసుకుంటోంది.

### అవార్డుల సాక్షిగా అంకితభావం.. సుస్థిర సేద్యమే మన లక్ష్యం

సుస్థిర అభివృద్ధి మరియు స్వావలంబన లక్ష్యాలుగా సాగుతున్న మన ప్రయాణంలో 2025వ సంవత్సరం చిరస్మరణీయ విజయాలను అందించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి నుండి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీద మన సంస్థ కార్యదర్శి సత్యనారాయణ 'బయో-కన్సర్వర్ అవార్డు – 2025' అందుకోవడం మనందరి సమిష్టి కృషికి దక్కిన గొప్ప గౌరవం. గిరిజన రైతులకు ఆర్థిక అండగా నిలవాలనే సంకల్పంతో చేపట్టిన సేంద్రియ కాఫీ సాగు నేడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. గిరిజన సహకార సంస్థ (GCC) భాగస్వామ్యంతో చింతపల్లి డివిజన్‌లోని సుమారు 1,900 మంది రైతులకు, అలాగే మన సంస్థ ప్రత్యక్ష కృషితో మరో 731 మంది రైతులకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ సాధించి పెట్టడం వల్ల వారికి మార్కెట్‌లో మెరుగైన ధర లభిస్తోంది. కేవలం కాఫీకే పరిమితం కాకుండా, సుమారు 3,800 ఎకరాల్లో మామిడి, అనాస తోటల సాగును ప్రోత్సహించడం ద్వారా మన ఏజెన్సీ ప్రాంతాల్లో ఒక ఉద్యానవన విప్లవానికి నాంది పలికాం.

### యువతకు శిక్షణ.. సామాజిక చైతన్యానికి బాటలు

గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో యువత పాత్ర మరువలేనిది. అందుకే గిరిజన యువతకు గ్రామసభలు, అటవీ హక్కులు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గిరిజన వికాస్ నిరంతరాయంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ముఖ్యంగా వినతుల ద్వారా ప్రభుత్వ పరిష్కార వ్యవస్థను ఎలా వినియోగించుకోవాలో మేము ఇస్తున్న శిక్షణకు విశేష స్పందన లభిస్తోందని తెలియజేయడానికి మేము ఎంతో సంతోషిస్తున్నాము. ఈ శిక్షణల ద్వారా యువత తమ హక్కులను కాపాడుకుంటూనే, ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను అట్టడుగు స్థాయికి చేరవేసే నాయకులుగా ఎదుగుతున్నారు.

### 'గిరిజన వికాస్' వార్తా లేఖ.. రచనలకు ఆహ్వానం

సంస్థ అమలు చేసే కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్య నిర్ణయాలు మరియు గిరిజన చట్టాలపై అవగాహనను మరింత విస్తృతం చేయడం కోసం 'గిరిజన వికాస్' పేరుతో ఈ వార్తా లేఖను మీ ముందుకు తీసుకువచ్చాము. ఈ జ్ఞాన యజ్ఞంలో భాగస్వాములయ్యే గిరిజన ప్రాంత రచయితలు, పరిశోధకులు మరియు ఉత్సాహవంతులైన యువతకు ఇదే మా ఆహ్వానం. గిరిజన సమాజ పరిస్థితులు, సంస్కృతి, సంప్రదాయాలు మరియు వికాసంపై మీ రచనలను, పరిశోధనలను పంపి ఈ ప్రయత్నంలో భాగస్వాములు కావాలని కోరుతున్నాము.

### మద్దతు కోరుతూ.. ధన్యవాదాలు


మన ఆశయ సాధనలో గిరిజన యువత, మేధావులు మరియు ప్రభుత్వ అధికారులు ఇదే స్ఫూర్తితో మనకు నిరంతరం మద్దతును అందిస్తారని ఆశిస్తున్నాం. ఈ ప్రయాణంలో మాకు వెన్నుదన్నుగా నిలిచిన అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, నాబార్డ్, గిరిజన సహకార సంస్థ (GCC) మరియు ఉద్యానవన శాఖలకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రతి గిరిజన గడపలో ప్రగతి కాంతులు విరియాలని ఆకాంక్షిస్తూ అందరికీ

**నూతన సంవత్సర & సంక్రాంతి శుభాకాంక్షలు.**

**ఎన్.వి.సత్యనారాయణ**
కార్యదర్శి, గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ

# గిరిజన వికాస్ కు అరుదైన గౌరవం

**పర్యావరణ, అటవీ పరిరక్షణ సేవలకు జీవవైవిధ్య రక్షక్ అవార్డుకు**



ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేతుల మీద 'జీవవైవిధ్య రక్షక్' అవార్డు అందుకున్న గిరిజన వికాస్ కార్యదర్శి ఎన్. సత్యనారాయణ

గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ (GVSS) కార్యదర్శి ఎన్. సత్యనారాయణ ఎపి డిప్యూటీ సీఎం, అటవీ,పర్యావరణ,గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీద ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు, ఆంధ్రప్రదేశ్ వారి 'జీవవైవిధ్య రక్షక్' అవార్డును అందుకున్నారు. మే 22 న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా జరిగిన ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎపి బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ఎన్. విజయ్ కుమార్, ఎపి బయోడైవర్సిటీ బోర్డు మెంబర్ సెక్రటరీ రామకృష్ణ, అటవీ శాఖ ఉన్నతాధికారులు సత్యనారాయణను శాలువ కప్పి,జ్ఞాపికతో అవార్డును బహూకరించారు.ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు.

గిరిజన వికాస్ సంస్థ వ్యవస్థాపకులైన ఎన్. సత్యనారాయణ గత కొన్ని దశాబ్దాలుగా జి.కె. వీధి, చింతపల్లి, కొయ్యూరు మండలాల గ్రామాల్లో జీవవైవిధ్య పరిరక్షణ, గిరిజనుల జీవనోపాధులు, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ విశేషంగా కృషి చేస్తున్నారు. గిరిజన రైతులను సహజ వ్యవసాయం, సేంద్రీయ పద్ధతులు అనుసరించేందుకు శిక్షణలు, ఆర్థిక సహాయం, వివిధ రకాల ప్రోత్సాహక కార్యక్రమాల ద్వారా జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేశారు.కెళ్లడంలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ గౌరవం చెందుతుందని పేర్కొన్నారు.

నాబార్డు మాతోట పథకం ద్వారా వందలాది ఎకరాల్లో మామిడి, లిచ్చీ, సీతాఫల తోటల పెంపకానికి విశేష కృషి చేశారు. అంతర పంటల ద్వారా జీవ పరిసర సమతుల్యత సాధనకు కృషి చేశారు. ఉపాధి హామీ, అటవీ శాఖ పథకాల సాయంతో నీరు, నేల పరిరక్షణకు పాటుపడ్డారు. జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన పిల్లల కోసం వ్యాసరచనలు, డిబేట్లు, ఆడియో-విజువల్ ప్రదర్శనలు నిర్వహించారు.

మాతోట, ఆంధ్ర కాశ్మీర్, మన్యతోరణ వంటి గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి, వారికి సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేసేందుకు మార్గదర్శనం అందించడం ద్వారా మంచి ఫలితాలు సాధించేందుకు సహకరించారు. గిరిజన సహకార సంస్థకు కాఫీ సరఫరా విషయంలో వేలాది ఎకరాల్లో సేంద్రియ ధ్రువీకరణ చేపడుతూ జిసిసి కాఫీకి విశిష్టమైన బ్రాండింగ్‌ను కల్పించారు.

ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు తనను 'జీవవైవిధ్య రక్షక్' అవార్డు అందుకోవడంపై గిరిజన వికాస్ సంస్థ కార్యదర్శి సత్యనారాయణ సంతోషం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు తమ సంస్థ పరిధిలో గిరిజనుల జీవనోపాధులు మరియు జీవవైవిధ్య రక్షణ కోసం పాటుపడుతున్న ప్రతి ఒక్కరికి లభించిన గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు. అలాగే తమ సంస్థ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ గౌరవం చెందుతుందని పేర్కొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం: 'మాతోట మాక్స్' సొసైటీ




గిరిజన మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా శ్రీ మహిళా మాతోట మాక్స్ (MACS) సొసైటీ అభ్యున్నతికి కృషి చేస్తోందని సంస్థ సీఈవో నెల్లూరు వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. చింతపల్లిలో నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడుతూ, గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సొసైటీలో ఇప్పటివరకు 6,000 మంది మహిళలు సభ్యులుగా చేరడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం చింతపల్లి, జీకే వీధి, జీ మాడుగుల మండలాల్లో తమ కార్యకలాపాలు విస్తరించామని, సభ్యులంతా పొదుపు అలవాటు చేసుకుంటూ తమ అవసరాలకు తగిన రుణాలు పొందుతూ స్వయం ఉపాధి దిశగా ఎదుగుతున్నారని వివరించారు. ప్రస్తుతం నెలకు రూ. 60 లక్షల వరకు రుణాలు పంపిణీ చేస్తున్నామని, వచ్చే ఏడాది నుంచి ఈ లక్ష్యాన్ని రూ. కోటి వరకు పెంచనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం సంస్థ చైర్‌పర్సన్ లోచల శారదా మాట్లాడుతూ, సభ్యుల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యక్తిగత రుణ పరిమితిని రూ. లక్ష వరకు పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళా సభ్యులు పాల్గొన్నారు.




# గిరిజన యువతకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు

గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గూడెం కొత్తవీధి మండలంలోని గిరిజన యువతకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి గిరిజన వికాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి జె. సత్యనారాయణ అధ్యక్షత వహించగా, ఎంపీడీఓ బి.హెచ్.వి. రమణబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీడీఓ రమణబాబు, తహసీల్దార్ అన్నాజి రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం అవ్వాలంటే గిరిజనులు అవసరమైన ధృవీకరణ పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. గిరిజన వికాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ.. గిరిజన యువత ప్రభుత్వ పథకాలు, చట్టాలపై అవగాహన పెంచుకొని, ప్రతి గిరిజన కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా ఎదిగే దిశగా కృషి చేయాలని అన్నారు. వ్యవసాయ శాఖ ప్రతినిధి గిరిబాబు, ఉపాధి హామీ ప్రతినిధి రాంప్రసాద్ తదితరులు అవగాహన కల్పించారు



# గిరిజన వికాస్ సేవలు అభినందనీయం

## ఏపీ రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ టి. బాబూరావునాయుడు

గిరిజన ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఏపీ రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ టి. బాబూరావునాయుడు తెలిపారు. గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రోత్సాహంతో ఆదివాసీ రైతులు ప్రకృతి సేద్య పద్ధతులను పాటిస్తూ సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించి, సంస్థ పనితీరును అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నదన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆర్గానిక్ హబ్‌గా ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. గిరిజన ప్రాంతంలో వ్యవసాయ, ఉద్యాన, సుగంధ ద్రవ్య పంటలను ఆదివాసీ రైతులు ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు.



ప్రకృతి వ్యవసాయం వలన బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తుందని చెప్పారు. పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ఆహార ఉత్పత్తులు, నేలలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ మేరకు రైతులు ప్రతి పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ సాగు చేసుకునేందుకు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులకు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం ఆయన జీసీసీ సహకారంతో దామనాపల్లి, దేవరాపల్లి, పెదవలస పంచాయతీల్లో సాగు చేస్తున్న కాఫీ, లిచి, ఆవకాడో, పసుపు పంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీఎం భాస్కరరావు, గిరిజన వికాస్ కార్యదర్శి నెల్లూరి వెంకట సత్యనారాయణ, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ యమున, రమ్య పాల్గొన్నారు.

## ఆగిపోయిన చదువు నుంచి ప్రభుత్వ కొలువు వరకు

# లకే బాబురావు విజయం వెనుక గిరిజన వికాస్





జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధిలోని ఎలుగు రాతి బందే అనే చిన్న గిరిజన గ్రామం నుంచి పోలీస్ కానిస్టేబుల్ అయిన లకే బాబురావు అనేక మందికి స్ఫూర్తినిస్తున్నారు. ఆర్థిక, సామాజిక పరిస్థితుల కారణంగా బాబురావు చదువును మధ్యలోనే వదిలేయాల్సి వచ్చింది. ఆ సమయంలో అతని జీవితానికి కొత్త దారి చూపింది గిరిజన వికాస్ సంస్థ. 2003 నుంచి 2012 వరకు జీకే వీధిలో గిరిజన వికాస్ నిర్వహించిన రెసిడెన్షియల్ బ్రిడ్జ్ కోర్స్ సెంటర్ అనేక మంది డ్రాప్‌అవుట్ విద్యార్థులకు ఆశాకిరణంగా నిలిచింది. మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించి, వారిని తిరిగి విద్యా ప్రవాహంలోకి తీసుకురావడమే ఈ కేంద్రం లక్ష్యం. నిరూపించే సజీవ వాస్తవం.

2011 విద్యా సంవత్సరంలో లకే బాబురావును ఈ బ్రిడ్జ్ కోర్స్‌లో చేర్చారు. ఒక సంవత్సరం పాటు అక్కడ క్రమశిక్షణతో, శ్రద్ధతో చదువు చెప్పిన తర్వాత, అతడిని పెదవలస ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదవ తరగతిలో తిరిగి చేర్పించారు. అప్పటివరకు ఆగిపోయిన అతని విద్యా ప్రయాణం మళ్లీ ఊపందుకుంది. చదువుపై నమ్మకం, జీవితంపై ఆశ తిరిగి పొందిన బాబురావు కష్టపడి ముందుకు సాగాడు. గిరిజన వికాస్ అందించిన మార్గదర్శకత్వం, సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ తన లక్ష్యాన్ని చేరుకున్నాడు. డిగ్రీ వరకు చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించి, తన గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. లకే బాబురావు కథ ఒక్క వ్యక్తి విజయం మాత్రమే కాదు. ఇది గిరిజన వికాస్ వంటి సంస్థలు గిరిజన ప్రాంతాల్లో చేస్తున్న మౌలిక విద్యా జోక్యాల ప్రభావాన్ని చాటిచెప్పే సజీవ ఉదాహరణ. ఒక అవకాశం, ఒక చేయి సహాయం... ఒక జీవితాన్నే మార్చగలదని నిరూపించే సజీవ వాస్తవం.

# 2025: గిరిజన సంక్షేమంలో నూతన దిశ

**బడ్జెట్ లో 46 శాతం నిధుల పెంపు**
**₹1.25 లక్షల కోట్లకు చేరిన వ్యయం**



2025వ సంవత్సరం భారత గిరిజన సంక్షేమ చరిత్రలో ఒక నూతన అధ్యాయంగా నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిధులను గతంలోని ₹10,237.33 కోట్ల నుండి ఏకంగా ₹14,925.81 కోట్లకు పెంచడం ద్వారా 46 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది 2047 నాటి 'వికసిత్ భారత్' లక్ష్యానికి బలమైన పునాది వేసింది. కేవలం ఒక శాఖే కాకుండా 41 మంత్రిత్వ శాఖల సమన్వయంతో అమలైన 'గిరిజన ఉప ప్రణాళిక' (DAPST) ద్వారా మొత్తం వ్యయం రికార్డు స్థాయిలో ₹1,24,908 కోట్లకు చేరుకుంది. ఈ భారీ నిధులు గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ మరియు తాగునీటి సదుపాయాల కల్పనకు ఊపిరి పోశాయి.

## పారిశ్రామిక సాధికారత & సాంస్కృతిక వేదికలు

గిరిజన సంస్కృతిని ప్రపంచ వేదికపై నిలబెట్టడంలో 'ఆది మహోత్సవ్' కీలక పాత్ర పోషించింది. న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించిన ఈ వేడుకలో వెయ్యి మందికి పైగా కళాకారులు పాల్గొని అంతర్జాతీయ గుర్తింపు పొందారు. అదేవిధంగా 'ట్రైబల్ బిజినెస్ కాంక్లేవ్ 2025' గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దింది. ఈ సదస్సులో "రూట్స్ టు రైజ్" వంటి కార్యక్రమాల ద్వారా 57 గిరిజన స్టార్టప్‌లు ₹10 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించడం విశేషం. ఇది గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ సౌకర్యం కల్పించడంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది.

## పీఎం-జన్మన్ మరియు విధానపరమైన నిర్ణయాలు

అత్యంత వెనుకబడిన తెగల (PVTG) కోసం ప్రవేశపెట్టిన 'పీఎం-జన్మన్' పథకం ద్వారా ఒక లక్ష కుటుంబాలకు పక్కా ఇళ్లను ప్రధాని నరేంద్ర మోదీ అంకితం చేశారు. దీనితో పాటు మారుమూల గ్రామాల్లో 500 కిలోమీటర్ల మేర రోడ్లు, టెలికాం టవర్ల ఏర్పాటుతో డిజిటల్ కనెక్టివిటీ పెరిగింది. డెహ్రాడూన్‌లో జరిగిన 'చింతన్ శిబిర్' ద్వారా పీఎం-యశస్వి వంటి స్కాలర్‌షిప్ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ చర్యలు చిట్టచివరి గిరిజన బిడ్డకు కూడా ప్రభుత్వ ఫలాలు అందేలా చేశాయి.

## ఆంధ్రప్రదేశ్: మన్యం అభివృద్ధిలో కొత్త అడుగులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన 2025-26 బడ్జెట్‌లో గిరిజన ఉప ప్రణాళిక కింద ₹8,159 కోట్లను కేటాయించింది. 'అన్నదాత సుఖీభవ' ద్వారా పోడు రైతులకు ₹20,000 పెట్టుబడి సాయం అందించడంతో పాటు, అరబికా కాఫీ ధరను కేజీకి ₹450కి పెంచి లక్ష మంది రైతులకు ఆర్థిక వెన్నుదన్నుగా నిలిచింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 71 కొత్త రహదారుల నిర్మాణం మరియు 1000 మొబైల్ టవర్ల ఏర్పాటుతో రవాణా, డిజిటల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. పోలవరం నిర్వాసితులకు ₹1,000 కోట్ల పరిహారం నేరుగా జమ చేయడం మరియు సాలూరులో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ పనులు వేగవంతం కావడం గిరిజన వికాసానికి నిదర్శనంగా నిలిచాయి.





**గిరిజన వికాస్' వార్తా లేఖ.. రచనలకు ఆహ్వానం:** గిరిజన ప్రాంత రచయితలు, పరిశోధకులు మరియు ఉత్సాహవంతులైన యువతకు ఇదే మా ఆహ్వానం. గిరిజన సమాజ పరిస్థితులు, సంస్కృతి, సంప్రదాయాలు మరియు వికాసంపై మీ రచనలను, పరిశోధనలను girijanavikasmedia@gmail.com లేదా +91 94946 71156 వాట్సాప్ కు పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.